ప్రభుత్వ సంస్థల్లో బట్టలుతికే పని రజకులకే ఇవ్వాలి

- జీఓ102ను వెంటనే అమలు చేయాలి
- ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ

బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందిస్తున్న కొండూరు సత్యనారాయణ

నల్లగొండ రూరల్, డిసెంబర్ 5: రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో బట్టలు ఉతికే పనిని రజకులకే ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ 102 జీఓ ప్రకారం ఉత్తర్వులిచ్చి 16 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదని, తక్షణమే జీఓను అమలు చేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రజక సేవా సంఘం, రజక సంఘాల సమితి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆ ఉత్తర్వులు అమలు చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్లకు, వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారులకు, రజక ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్‌కు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా 102 జీఓను తక్షణమే అమలు చేయాలని కోరారు. రజక, నాయీ బ్రాహ్మణుల ఉచిత విద్యుత్ బకాయిలు రూ. 200 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలకు నిలయంగా గురుకులాలు

బీఆర్ఎస్ గురుకుల బాట ఇన్‌చార్జి కడారి స్వామియాదవ్

మూసీ గురుకులంలో పరిసరాలను పరిశీలిస్తున్న నాయకులు

కేతేపల్లి, డిసెంబర్ 5 : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు సమస్యలకు కేంద్రాలుగా మారాయని బీఆర్ఎస్‌వీ గురుకుల బాట రాష్ట్ర ఇన్‌చార్జి కడారి స్వామియాదవ్ విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని బొప్పారం గ్రామ శివారులో గల మహాత్మా జ్యోతిబా పూలే మూసీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఇటీవల పాము కాటుకు గురైన విద్యార్థి బద్దం గణేశ్‌తో మాట్లాడారు. అనంతర పాఠశాల ఆవరణలో ఉన్న మురుగు నీటిని, చెత్తను పరిశీలించారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. చుట్టూ ప్రహరీ లేక పోవడంతో పాఠశాల ఆవరణలోకి విష పురుగులు వస్తున్నాయన్నారు. విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వకపోవడంతో చలికి వణకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పాటించక పోవడంతో వారికి సరైన ఆహారం అందడం లేదన్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, నాయకులు కట్టా శ్రీనివాస్, గాదె శివ, ఎన్.శంకర్, వి.చేతన్‌కుమార్, సాయకళ్యాణ్, జి.వెంకన్న ఉన్నారు.

తూకాల్లో మోసాలపై వినియోగదారులకు అవగాహన

వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 5 : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా తూకాల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ కె. సిద్ధార్థకుమార్, జిల్లా అధికారి పి.రామకృష్ణ అవగాహన కల్పించారు. వ్యాపారులు ఉపయోగించే తూకంరాళ్లు, యంత్రాల ద్వారా ఎలా మోసం చేస్తున్నారనే విషయాన్ని వినియోగదారులకు చూపించారు. వ్యాపారులు ఉపయోగించే తూకం రాళ్లు, యంత్రాలను తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ వారితో సరి చూసి ముద్ర వేయించుకోవాలని సూచించారు. వినియోగదారులు ఫిర్యాదులకోసం సెల్ :9440575081, 90106517 83 నంబర్లను సంప్రదించాలని కోరారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీఎన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తాం

- సీపీఎం నాయకులు

ఎంవీఎన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నీలగిరి, డిసెంబర్ 5 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకటనర్సింహారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం ఎంవీఎన్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఎంవీఎన్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, పుచ్చకాయల నర్సిరెడ్డి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడలో నివాళి

మిర్యాలగూడ : స్థానిక సీపీఎం కార్యాలయంలో దివంగత ఎంవీఎన్ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, అయూబ్, పాదూరి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాల వసతిగృహం తనిఖీ

నిడమనూరు, డిసెంబర్ 5 : మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని గురువారం తాసీల్దార్ జంగాల కృష్ణయ్య తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈఓ లావూరి వెంకన్న, కాంప్లెక్స్ హెచ్ఎం గౌతమ్, కేర్ టేకర్ రాజేశ్వరి ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మెడికల్ కళాశాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు

నీలగిరి/నార్కట్‌పల్లి, డిసెంబర్ 5 : ఈ నెల 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లను గురువారం రోడ్లు భవనాలు, సినిమటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. మొదటగా నార్కట్‌పల్లి మండలంలోని బి.వెల్లెంల ఉదయసముద్రం ప్రాజెక్టును, తర్వాత నల్లగొండలోని మెడికల్ కళాశాలను, ఎన్‌జీ కళాశాలలో బహిరంగ సభ ప్రాంగణాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం ముందుగా బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. 2008లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని,16 సంవత్సరాల తరువాత ప్రాజెక్టు పూర్తయి వినియోగంలోకి వస్తున్నదన్నారు. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దాంతో పాటు శ్రీశైలం సొరంగ మార్గం పనులను కూడా వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. అక్కడి నుంచి దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-2ను, తర్వాత నల్లగొండ మెడికల్ కళాశాలను సీఎం ప్రారంభించనున్నట్లు చెప్పారు. దాంతో పాటు నర్సింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేస్తారని, రూ.40 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించి, గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు ఎస్పీ రాములునాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, ఆర్డీఓ ఆశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి ఉన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

మల్టీ జోన్-II ఐజీ సత్యనారాయణ గురువారం సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రాహ్మణ వెల్లంల, ఎన్‌జీ కళాశాల, హెలీప్యాడ్, మెడికల్ కళాశాల వద్ద భద్రతను పర్యవేక్షించారు. బహిరంగ సభ దృష్ట్యా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఎస్పీ డీఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్పీ సీఐ రాఘవరావు, చిట్యాల సీఐ నాగరాజు, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, డిసెంబర్ 5 : మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ నివాసంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు మండలాల అయ్యప్ప మాలధారులు, ఆంజనేయ, శివ మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగత్‌కుమార్, ఆయన కుమారుడు నోముల రాణా అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో నోముల భవాని, నోముల లక్ష్మి, సాదం సంపత్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

హాలియా కొదండ రామాలయంలో గురువారం అయ్యప్ప, ఆంజనేయ, శివ మాలధారులకు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నదానం చేశారు. అనంతరం అయ్యప్ప మాల ధారణలో ఉన్న నోముల భగత్‌కుమార్ ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయల్దేరి వెళ్లారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ సిటీ, డిసెంబర్ 5 : నల్లగొండ మెడికల్ కాలేజీ వద్ద మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను గురువారం కనగల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ ఎంపీపీ కరింపాషా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, బోయినపల్లి సొసైటీ చైర్మన్ బొమ్మరబోయిన భార్గవ్, నల్లబోతు యాదగిరి, సింగిల్‌విండో డైరెక్టర్ శంకర్‌నాథ్ ఉన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుంది

- ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం జానిరెడ్డి

నల్లగొండ సిటీ, డిసెంబర్ 5: ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని మహిళలకు ఆధార్‌కార్డు గుర్తింపుతో అందిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతుందని సంస్థ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్టీసీ ఆధ్వర్యంలో నల్లగొండ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, ఆర్ఎంఓ శివ శంకర్, రీజనల్ పీఓ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ మేనేజర్ శ్యామలాదేవి, నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

హాలియా, డిసెంబర్ 5 : నల్లగొండ జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టును గురువారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య ప్రకటించారు. ఈ నెల 3న అనుముల మండలం ఇబ్రహింపేట గ్రామంలో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి ఈ నెల 7 నుంచి 10 వరకు హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. టీమ్‌కు కోచ్‌గా అన్వర్‌ఖాన్, మెనేజర్‌గా నాగమణి వ్యవహరిస్తారని తెలిపారు.

జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఎస్‌కే ఆయేషా(అలీనగర్) కెప్టెన్, కె.అంజలి(దుగ్గిపల్లి), ఎం.స్వాతి (మిర్యాలగూడెం), ఎన్, కీర్తి(ఇబ్రహింపేట), టి.హన్సిక (తిరుమలగిరి),ఆర్.నందిని (మల్లేపల్లి), ఎం.అభినయ్‌శ్రీ(కట్టంగూర్), ఎండీ. అఫ్షా(అలీనగర్), వి.మౌనిక, (నల్లగొండ), వి.సాయిఅభిజ్ఞ(తిరుమలగిరి), వి.పూజ (దేవరకొండ), ఎన్.పావని (యాద్గార్‌పల్లి),ఆర్.లక్ష్మి (మిర్యాలగూడ)

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు సాగర్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలిత

నందికొండ, డిసెంబర్ 5 : నాగార్జున సాగర్ సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు జె. సుప్లవిరాజ్, ఎండీ సుభానూర్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టిర్ లలిత తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. గతనెల 24 నుంచి 26వరకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -17 నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఈ నెల 11 నుంచి 13 వరకు పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఎన్నిక

దామరచర్ల, డిసెంబర్ 5: గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బి. స్కైలాబ్‌నాయక్, అధ్యక్షుడిగా గుగులోతు రాందాస్‌నాయక్, ప్రధానకార్యదర్శిగా రమావత్ బాలూనాయక్, ఉపాధ్యక్షులుగా ఎల్. హరికిషన్, ఆర్. బుజ్జి, కోశాధికారిగా ఆర్. హరి, కార్యదర్శులుగా ఎన్. బాబునాయక్, బాబ్లానాయక్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘం రాష్ట్ర ఆసోసియేట్ అధ్యక్షుడు బానావత్ సైదులు, ఉపాధ్యక్షులు తిరుపతినాయక్, బాషానాయక్ వ్యవహరించారు.

ప్రశాంతంగా జీఎన్ఎం పరీక్షలు

నీలగిరి, డిసెంబర్ 5 : పది రోజులుగా జరుగుతున్న జీఎన్ఎం పరీక్షలు గురువారంతో ముగిసినట్లు నల్లగొండ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి తెలిపారు. పరీక్షలకు మొత్తం 1,537 మంది హాజరు కావాల్సి ఉండగా 1,475 మంది హాజరయ్యారని, పరీక్షల నిర్వహణ అధికారిగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించిన సిబ్బందిని ఆమె అభినందించారు.

నేడు సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణకు సన్నాహక సమావేశం

- జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి నర్సిరెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబర్5 : ఈ నెల 7 నుంచి గ్రామస్థాయిలో నిర్వహించే సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణపై శుక్రవారం సాయంత్రం 3 గంటలకు నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హాజరు కావాలని కోరారు.

గురుకులంలో పీజీటీ పోస్టుకు దరఖాస్తులు

నిడమనూరు, డిసెంబర్ 5 : కనగల్ మండలం ఇస్లాంపురలోని రామానందతీర్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం (నిడమనూరు)లో ఫిజికల్ సైన్స్ (పీజీటీ) బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెస్సీ బీఈడీ అర్హత కలిగిన వారు అర్హులని, ఆసక్తిగల వారు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దయాకర్ కుటుంబానికి చిరుమర్తి పరామర్శ

నార్కట్‌పల్లి, డిసెంబర్ 5 : మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన ముద్దం దయాకర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామానికి వెళ్లి దయాకర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ లింగస్వామి

చిట్యాల, డిసెంబర్ 5 : చిట్యాల 7వ వార్డుకు చెందిన గాదె సైదులు కూతురు శ్రీలక్ష్మి వివాహానికి గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి రూ. 1,0016 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వార్డులో పేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

భూ సర్వే తనిఖీ

తిరుమలగిరి(సాగర్), డిసెంబర్ 5: రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా గురువారం మండలంలోని చింతలపాలెం, తిమ్మాయిపాలెం, నెల్లికల్ గ్రామ శివారులోని భూముల సర్వేను సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ శివారులో ఉన్న పట్టా నంబర్, హద్దు రాళ్లను సర్వే చేశామన్నారు. ఆయన వెంట డీఐ రమణయ్య, సర్వేయర్ హరీశ్, విజయ్, రాము, శోభన్, ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు మీడియా వారధిగా నిలువాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నీలగిరి, డిసెంబర్ 5 : ప్రభుత్వానికి, ప్రజలకు మీడియా వారధిగా నిలువాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి సహకారంతో జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వార్తలు ప్రజలకు చేరువగా ఉండాలని, సమస్య పరిష్కారానికి నిలయంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులు కేవలం వార్తలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టు గణేశ్, ఆధ్యక్షుడు ఎర్రెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, యశోద ఆస్పత్రి వైద్యులు ప్రపుల్ కిల్లార్, శిల్పారెడ్డి, చేతన్ వీరమనేని, రాఘవేందర్‌గౌడ్, కమల్ తేజ్, భానుతేజ, వినీత జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ తాగునీరందించేందుకు కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 5 : నకిరేకల్ పట్టణంలోని అన్ని ఇండ్లకూ తాగునీరందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా అమృత్-2 పథకంలో కింద రూ.25 కోట్లతో పట్టణంలోని నిమ్మమార్కెట్‌లో, కడపర్తి రోడ్డులోని వడ్ల మార్కెట్‌లో తాగునీటి సరఫరా ట్యాంకుల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం కింద 42 కిలోమీటర్ల పైప్ లైన్ ర్పాటు చేసి ప్రజలకు తాగునీరందిస్తామన్నారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్, వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణీకృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, టీయూఎఫ్ఐడీసీ ఇంజినీర్ కె.వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ జి. సత్యనారాయణ, డీఈఈ బి. మనోహర, ఏఈ గౌతమ్‌రాజ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- డీఈఓ భిక్షపతి

కేజీబీవీలో స్టోరూమ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

తిప్పర్తి, డిసెంబర్ 5: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. భోజనానికి నాణ్యమైన బియ్యం, తాజా కూరగాయాలను మాత్రమే వినియోగించాలని, మెనూ పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ అపర్ణ, ఎస్ఓ రాజరాజ